నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 12 మార్చి 2024 | NIZAMABAD

## బీఆర్ఎస్‌ను వీడేది లేదు

**కేసీఆర్ వెంటే నడుస్తా**
**మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి**



డిచ్‌పల్లి, మార్చి 11: మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తానని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు పలు చానళ్లలో వచ్చిన వార్తలను ఆయన సోమవారం ఖండించారు. కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రచారం చేస్తున్నారని, అవన్ని అసత్య ఆరోపణలని కొట్టి పడేశారు. వాటిని నమ్మొద్దని పార్టీ శ్రేణులకు సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ తనకు మూడుసార్లు టికెట్ ఇచ్చి అవకాశం కల్పించారన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రెండుసార్లు గెలిచానని, ఒకసారి ఓడినంత మాత్రాన పార్టీ మారుతానని అనుకోవద్దని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌ను వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కొందరు నాయకులు పార్టీకి ద్రోహం చేసినట్లు తాను చేయబోనన్నారు. 'ఇదంతా కుట్రలో భాగంగానే దుష్ప్రచారం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తా. టికెట్ వచ్చినా, రాకున్నా పార్టీని వీడేది లేదు. లైఫ్ ఇచ్చిన వారికి ద్రోహం చేయను. కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దని' సూచించారు.

**రంజాన్ వేళలు**
మంగళవారం
ఇఫ్తార్ - సాయంత్రం
6:34
బుధవారం
సహర్ - ఉదయం
5:16



## నేటి నుంచి రంజాన్ ఉపవాసదీక్షలు

సుభాష్‌నగర్, మార్చి 11: ముస్లిములు పవిత్రంగా భావించే రంజాన్ ప్రార్థనలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం రాత్రి నెలవంక కనిపించడంతో ఉపవాస దీక్షలు ప్రారంభించాలని మతపెద్దలు పిలుపునిచ్చారు.

**వరాల వసంతం**

ఆధ్యాత్మిక సౌరభాలు పరిమళించే వరాల వసంతం రంజాన్ రోజులు. పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించింది ఈ మాసంలోనే. ప్రతి ఒక్కరూ పరిపూర్ణమైన ప్రేమమూర్తిగా మనిషిలో క్రమశిక్షణ, ఐక్యత, సర్వమానవ సౌభ్రతృత్వం, సహనశీలం, కోర్కెలను అదుపులో పెట్టుకొనే మనోశ్చలత, దయ, దానగుణం పెంపొందించుకోవడం రంజాన్ మాసం ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాలోని ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

**పోచారం శుభాకాంక్షలు..**

బాన్సువాడ టౌన్, మార్చి 11: రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిములకు మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కలిసిమెలిసి జరుపుకోవాలని కోరారు.

## ప్రజావాణి.. మాకిదే పని

**ప్రజా సమస్యలు** ఆలకించేందుకు ఉద్దేశించిన ప్రజావాణి.. కొందరు అధికారులకు టైమ్‌పాస్ వ్యవహారంగా మారింది. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, టెలిగ్రామ్‌లో కాలక్షేపానికి, ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడానికి ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం వేదికగా తయారైంది. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కొందరు జిల్లా అధికారులు వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేసింది. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు ఫోన్లలోనే నిమగ్నమయ్యారు. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో వీడియోలు చూస్తూ ఎంజాయ్ చేశారు. వేదికపై ఉన్న అధికారులు దరఖాస్తుల స్వీకరణలో నిమగ్నమైతే, కింద కూర్చున్న వారేమో ఇలా 'ఆన్‌లైన్'లో విహరించారు. ఆయా దృశ్యాలను 'నమస్తే' క్లిక్‌మనిపించింది.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



- గ్రామాల నుంచి గొలుసుకట్టు నెట్‌వర్క్
- పోలీసులతో మిలాఖత్
- సీఎంఆర్ కోసం అక్రమ దందా
- చక్రం తిప్పుతున్న బోధన్ వ్యాపారి
- తేటతెల్లం చేసిన వేల్పూర్ రైస్‌మిల్ ఉదంతం

# టన్నుల్.. టన్నుల్

**రైస్‌మిల్లుల్లో పీడీఎస్ బియ్యం నిల్వలు**



ఇటీవల వేల్పూర్‌లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న అధికారులు



నిజామాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లాలో టన్నుల కొద్దీ దొడ్డు బియ్యం నిల్వలు బయట పడుతూనే ఉన్నాయి. అధికారుల తనిఖీల్లో గుట్టు రట్టు అవుతుండడంతో అంతా అవాక్కవుతున్నారు. రెండు రోజుల క్రితం వేల్పూర్‌లోని ఓ రైస్‌మిల్లులో వెలుగు చూసిన ఉదంతంతో అందరూ నోళ్లెల్లబెట్టాల్సి వస్తున్నది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 120 మెట్రిక్ టన్నులు( లక్షా 20వేల కిలోలు) మేర అక్రమ బియ్యం నిల్వలు గుర్తించడం రికార్డుగా మారింది. ఇంత భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు ఏ విధంగా సేకరించారన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మిగులుతున్నది. లోతుగా ఈ వ్యవహారాన్ని శోధిస్తే భారీ నెట్‌వర్క్ వేళ్లూనుకొని ఉంటుందని అంతా భావిస్తున్నారు. ప్రధానంగా రైస్‌మిల్లులోనే బియ్యం నిల్వలు పట్టుబటడంతో సీఎంఆర్‌కు లింక్ ఉన్నట్లుగా అర్థమవుతున్నది.

**గ్రామాల్లో సేకరణ..పట్టించుకోని అధికారులు..**

ప్రతినెలా రెండో వారంలోనే గ్రామాల్లోకి బియ్యం కొనుగోలుదారులు ప్రవేశిస్తున్నారు. ఆటోల్లో తిరుగుతూ కిలోకు రూ.10 వరకు చెల్లించి అందినకాడికి తీసేసుకుంటున్నారు. బహిరంగంగానే ఇదంతా జరుగుతున్నప్పటికీ స్థానిక పోలీసులు కానీ రెవెన్యూ యంత్రాంగం కానీ పట్టింపు లేకుండా వ్యవహరించడం ఇందులోని అసలు విషయం. సామాన్యుల నుంచి రూ.10కి సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని రెట్టింపు ధరలకు మిల్లర్లకు అందిస్తున్నారు.

**బోధన్ వ్యాపారి హస్తం..**

వేల్పూర్‌లో రైస్‌మిల్ వ్యవహారంలో బోధన్‌కు చెందిన ఓ వ్యాపారి హస్తం ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఇతడికి బోధన్ నియోజకవర్గంతోపాటు సరిహద్దులో మహారాష్ట్రలోనూ లీజుకు, సొంతంగా రైస్‌మిల్లులు, గోదాములు ఉన్నట్లు సమాచారం. తెలంగాణలోని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ తదితర ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఆయా గోదాముల్లో నిల్వచేసి సీఎంఆర్ సమయంలో ఇవే బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లుగా తెలుస్తున్నది. రైస్‌మిల్ యంత్రాలను నడిపించకుండానే, కరెంట్ మీటరు గిరగిరా తిరగకుండానే కూర్చున్న చోటే సీఎంఆర్ పూర్తిచేయడం ఇందులోని మర్మంగా కనిపిస్తున్నది. బోధన్ వ్యాపారికి ఈ వ్యవహారంలో సిద్ధహస్తుడిగా పేరున్నది. తనఖా పడుతున్న రైస్‌మిల్లులను చేజిక్కించుకోవడం, లీజులకు తీసుకోవడంలో దిట్ట. అప్పులపాలై ఇబ్బందులు పడుతున్న రైస్‌మిల్లర్లను తన వలలో వేసుకొని రైస్‌మిల్లులను అధికారికంగా మార్చిడి చేసుకోకుండానే దందాను నడుపుతున్నట్లుగా సమాచారం. పీడీఎస్ రైస్‌ను నిల్వచేస్తే అసలు ఓనర్‌కే చిక్కులు వస్తాయి. తద్వారా అక్రమ వ్యాపారం చేసే తెర వెనుక ఉన్న కుట్రదారుడు సేఫ్‌గా ఉండడం ఇందులోని భాగంగా తెలుస్తున్నది. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం సైతం వంత పాడుతున్నట్లుగా అవగతమవుతున్నది.

**నోరుమెదపని రైస్‌మిల్ అసోసియేషన్...**

ఈ వ్యవహారంపై అన్నీ తెలిసినా రైస్‌మిల్ అసోసియేషన్ మిన్నకుండిపోతుండడం విచిత్రంగా ఉన్నది. అక్రమ వ్యవహారాలను రూపుమాపి మిల్లర్లను సన్మార్గంలో పెట్టాల్సిన సంఘం పెద్దలెవ్వరూ నోరు విప్పకపోగా తెరచాటున పలువురు బడానేతలే పాత్రధారులుగా ఉంటుండడం చర్చనీయాంశం అవుతున్నది. రాజకీయ పార్టీల్లో సభ్యత్వం కలిగిన పలువురు నేతల హస్తం కూడా ఇందులో ఉన్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. వేల్పూర్‌లో పట్టుబడిన 120 టన్నుల పీడీఎస్ బియ్యం వ్యవహారంలో లోతైన విచారణ జరుగుతుందా? ఇందులో అసలు దొంగలు చట్టం ముందు దోషులుగా నిలబడతారా? లేదా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

# పంటలను కాపాడుతాం

**మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం**
**బీర్కూర్ నల్లజేరు చెరువు తూము పరిశీలన**

నస్రుల్లాబాద్, మార్చి 11: నియోజకవర్గంలో ఎకరం కూడా ఎండిపోకుండా పంటలను కాపాడుతామని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బీర్కూర్ నల్లజేరు చెరువును సోమవారం ఆయన పరిశీలించారు. తూములో చెత్త ఇరుక్కొని పంట పొలాలకు నీరందడం లేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే పోచారం సమాచారం ఇవ్వడంతో ఆయన చెరువు తూమును పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. నీటి అడుగున చెత్త, ఇతర అడ్డంకులను శుభ్రం చేసేందుకు నిపుణులను పిలిపించి మంగళవారం సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ... నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని అలీసాగర్ వరకు ఈ యాసంగిలో 1.30లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక తయారు చేశామన్నారు. ఏడు విడుతలుగా సాగునీరు అందిస్తున్నామని, ప్రస్తుతం ఆరో విడుత నీటి విడుదల కొనసాగుతుందన్నారు. బీర్కూర్ నల్లజేరు చెరువు కింద 650 ఎకరాల ఆయకట్టు ఉన్నదని తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు సందీప్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, నాయకులు ఉన్నారు.



చెరువు గట్టుపై అధికారులతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

# ₹18,299

## పసుపునకు రికార్డు ధర

**సిరులు కురిపిస్తున్న పచ్చబంగారం**
**పంట విస్తీర్ణం తగ్గడంతో పెరిగిన డిమాండ్**
**ఈ సీజన్‌లో 2.21 లక్షల క్వింటాళ్ల కొనుగోలు**
**అనూహ్యంగా పెరుగుతున్న ధర**
**రూ.20 వేలకు చేరే అవకాశం**



నిజామాబాద్ మార్కెట్ యార్డుకు తరలివచ్చిన పసుపు

ఖలీల్‌వాడి, మార్చి 11: పచ్చబంగారం రైతు ఇంట సిరులు కురిపిస్తున్నది. కొన్నేండ్లుగా నష్టాలు తెచ్చిపెట్టిన పసుపు పంట ఈ ఏడాది దండిగా లాభాలు తెచ్చిపెడుతున్నది. పంట విస్తీర్ణం తగ్గడం, మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరగడంతో రికార్డు స్థాయి ధర పలుకుతున్నది. నిజామాబాద్ మార్కెట్‌లో సోమవారం అత్యధికంగా రూ.18,299 ధర పలకడం విశేషం. మార్కెట్ యార్డు చరిత్రలో ఇదే అత్యధికమని అధికారులు, రైతులు చెబుతున్నారు. అంక్సాపూర్‌కు చెందిన రైతు పాశపు మహేశ్ తెచ్చిన పసుపునకు ఈ రికార్డు ధర లభించింది. దాదాపు పదిహేనేండ్ల క్రితం రూ.18 వేల రేటు నమోదైంది. ఆ రికార్డును చెరిపేస్తూ సోమవారం కొత్త ధర నమోదు కావడం విశేషం.

**దశాబ్దాలుగా నష్టాలే..**

రైతులు తల్లి పంటగా భావించే పసుపు పంట కొన్నేండ్లుగా నష్టాల్నే మిగుల్చుతున్నది. అయినప్పటికీ అన్నదాతలు పసుపును మాత్రం వదిలిపెట్టలేదు. ఒకప్పుడు బాగా డబ్బులు తెచ్చిపెట్టిన పచ్చ బంగారం.. మార్కెట్ మాయాజాలం కారణంగా ధర లేక రైతాంగం కుదేలైంది. దీంతో రైతులు సాగు విస్తీర్ణం తగ్గించారు. వాస్తవానికి తెలంగాణలో అత్యధికంగా పసుపు సాగయ్యేది నిజామాబాద్ జిల్లాలోనే. ఐదారేండ్ల క్రితం వరకు నిజామాబాద్ జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో పంట పండించే వారు. అయితే, నష్టాల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గించేశారు. తొమ్మిది నెలల పంట, పెట్టుబడి అధికం కావడం, వాతావరణం అనుకూలించక దిగుబడి పడిపోవడం, గిట్టుబాటు ధర దక్కక పోవడంతో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గించుకుంటూ వచ్చారు. ఈ సంవత్సరం 19 వేల ఎకరాల్లోనే పసుపు పండించారు. జనవరి నుంచి తవ్వకాలు చేపట్టి పంటను మార్కెట్‌కు తీసుకొస్తున్నారు.

**భారీగా డిమాండ్..**

దశాబ్ద కాలం క్రితం మంచి రేటు పలికిన పసుపు ఆ తర్వాత నుంచి తగ్గిపోయింది. అప్పట్లో క్వింటాల్ పసుపు అమ్మి తులం బంగారం కొనేవారు. అలాంటి పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. రేటు కనిష్టంగా రూ.4–6 వేలకు పడిపోయింది. ఈ స్థితిలో రైతులు పసుపు సాగు తగ్గించారు. సగానికి సగం సాగు విస్తీర్ణం తగ్గడం, అదే సమయంలో విదేశాల్లో మన పసుపునకు డిమాండ్ పెరగడంతో పంటకు ఆదరణ పెరిగింది. ఫలితంగా ఈసారి ధర పాత రికార్డులను చెరిపేస్తే కొత్త రికార్డులను నమోదు చేస్తున్నది. దశాబ్ద కాలంగా నష్టాలు చవిచూసిన రైతులకు ఈసారి ఊహించని రీతిలో లాభాలు వస్తున్నాయి.

**మొదట్లో తక్కువ ధరకే..**

సీజన్ ప్రారంభంలోనే చాలా మంది రైతులు తమ పంటను అమ్ముకున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే అత్యధిక రైతులు పంటను అమ్మేశారు. అప్పుడు రూ.8–10 వేల మధ్యే ధర పలికింది. మెజార్టీ రైతుల నుంచి పంట వెళ్లిపోయిన తర్వాత ఇప్పుడు ధర పెరుగుతుండడం గమనార్హం. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 2.21 లక్షల క్వింటాళ్ల పసుపు మార్కెట్‌కు వచ్చింది. గత సోమవారం ఒక్కరోజే 30 వేల క్వింటాళ్లు రావడం విశేషం. ఇక నిన్న (మార్చి 11న) 10,671 క్వింటాళ్ల కొమ్ము, 5,268 క్వింటాళ్ల మండ, 1,571 క్వింటాళ్ల చూర నిజామాబాద్ మార్కెట్ యార్డుకు చేరింది. ఇందులో అంక్సాపూర్‌కు చెందిన పాశపు మహేశ్ తెచ్చిన కొమ్ముకు రూ.18,299 రేటు పలికింది. కనిష్టంగా రూ.8 వేలు, సగటున (మాడల్) రూ.14,250 చొప్పున ధర పలికినట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో పసుపు ధర రూ.20 వేలు దాటొచ్చని చెబుతున్నారు.

**రికార్డు ధర..**



మార్కెట్‌కు పసుపు ఉత్పత్తులు తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ధర తగ్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. పసుపు ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉండడంతో రేటు పెరుగుతున్నది. పసుపు ధర కొత్త రికార్డు నమోదు చేస్తున్నది. మొన్న రూ.15 వేలు పలికిన కొమ్ము.. ఇవాళ రూ.18 వేలకు చేరింది.

**- వెంకట్, మార్కెట్ కమిటీ కార్యదర్శి**



నాచుపల్లితండాలో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ ఏఈ ధన్‌రాజ్

## నాచుపల్లి తండాలో తాగునీటి సమస్య పరిష్కారం

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

కోటగిరి, మార్చి 11: కోటగిరి మండలం నాచుపల్లి తండాలో తాగునీటి సమస్యపై ఈ నెల7న 'తాగునీటికి తండ్లాట'అని నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో బోరు మోటరుకు మరమ్మతులు చేశారు. మిషన్‌భగీరథ అధికారులు సైతం రోజూ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు 'నమస్తే తెలంగాణ'కు ధన్యవాదాలు తెలిపారు.

## మరమ్మతులకు ట్రాక్టర్లు

**పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ**
**ట్రాక్టర్లు, నర్సరీలను పరిశీలించిన డీఎల్‌పీవో**

నిజాంసాగర్, మార్చి 11: 'ప్రత్యేక పాలన అస్తవ్యస్తం' అంటూ నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈనెల 11న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, ఆరేపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీవో నాగరాజు మెమోలు జారీ చేశారు. సోమవారం ఆయా గ్రామాలను డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అబ్బాగౌడ్, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ సందర్శించారు. మూలనపడిన ట్రాక్టర్లను పరిశీలించి మరమ్మతులకు ఆదేశించడంతో షోరూంలకు తరలించారు. నర్సరీలను పరిశీలించి వెంటనే మోటార్లకు మరమ్మతులు చేయించి మొక్కలను కాపాడాలని ఆదేశించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు అంబయ్య, సునీత, హరీశ్ ఉన్నారు.



అచ్చంపేటలో మరమ్మతుల కోసం ట్రాక్టర్‌ను షోరూమ్‌కు తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది



ఆరేపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో